

# ఆఖరి ఆకు

కాసుశోల నరసింహారావు

'అమ్మా, ఆకులు ఎందుకే అలా రాలిపోతున్నాయి? మొన్న మొన్ననే కదటే ఆ చెట్టు ఆకులతో నిండి, చూడడానికి ఎంతో అందంగా వుండేది. ఈవేళ చూడవే, ఇంచుమించు అన్నీ రాలిపొయ్యాయే! ఏవో ఏడెనిమిది మాత్రం నేడో రేపో అన్నట్లు వున్నాయి.'

'నీ కెందుకమ్మా ఇప్పుడు ఆ ఆలోచనలన్నీ. డాక్టరుగారు ఏమని చెప్పారో, తెలుసా? ఇలాగ వూరికే ఆలోచిస్తూంటే బలహీనత హెచ్చి జబ్బు ఎక్కువవుతుందన్నారు. ఎంత నిద్రపోతే అంత మంచిదట. నువ్వు ఆయన చెప్పినట్లు చేస్తే త్వరగా నెమ్మదించి మళ్లీ చిత్రించడం ప్రారంభించవచ్చు. నాతల్లివి కాదూ, నిద్రపో. డాక్టరుగారు వచ్చినట్లుంది. ఉండు తల్లీ' అంటూ పార్వతమ్మ లక్ష్మి తలను తన తొడనుంచి క్రిందకుదించి తలుపు తీయబోయింది.

'తమరా? దయచెయ్యండి. ఏమంటారు, నా తల్లి బ్రతుకుతుందో, లేదో చెప్పండీ.'

'మీరు మరేమీ అనుకోరుగదా, పార్వతమ్మగారూ-అధైర్యపడి ప్రయోజనం లేదు. కానీ మీకొక సంగతి చెప్పాలి. ఆ కిటికీలోనుంచి కనిపిస్తూన్న మామిడి మొక్కను జూచారూ, అదీ ఇంతపని చేస్తూంది. ఆకులురాలే కాలము కాదుటండి, ఇది. ఆచెట్టు ఆకులు రాలిపోతూంటే, దానికీ తన దేహస్థితికీ ఏదో సంబంధమున్నట్లు తోస్తూంది, అమ్మాయికి. మీరు తగుజాగ్రత్త వహించి ఆ అమ్మాయి తలపులను ఆ మామిడిమొక్కమీద నుంచి మరపించక పోయినట్లయితే, ప్రమాదమే వాటిల్లవచ్చు. ఇక మీ అదృష్టము' అని లోపలకు వెళ్లబోతూ మళ్లీ వెనక్కు తిరిగి

'ఏమండీ పార్వతమ్మగారూ, లక్ష్మికి తీరని కోరికలేమైనా వున్నాయండీ' అని అడిగాడు.

'ఏదో, చేతనైనంతవరకు, దానికోరికలన్నీ తీరుస్తూనే వచ్చాను.'

'అది కాదండీ-ఏ పురుషుడిమీదనైనా...' అని నీళ్లు నమల నారంభించాడు, డాక్టరు.

'నమ్మితే నమ్మండి, నమ్మకపోతే నమ్మకపోండి కానీ, దానికి ఎంచేతనో పురుషులంటే పరమ అసహ్యము.'

'పోనీ పురుషులు కాకపోతే, ఆమెకు జీవితములోపల ఇది చెయ్యాలి, అది చెయ్యాలి అనేకోరిక లేదాండి? అంటే ఒక విధమైన ఆశయమన్నమాట.'

'ఆశయమండీ! ఒక నాలుగయిదేండ్లనుంచీ బొమ్మలు రాయడం ప్రారంభించిందండీ. ఇదుగో, ఇవన్నీ నా చిట్టి తల్లి గీచినవేనండీ! దానికి ఒక్క కోరికమాత్రంబలంగావుందండీ. ఆగ్రాకెళ్ళి పున్నమనాడు తాజమహలును చిత్రించాలని.'

'అలాగాండీ? అయితే మీమీద ఒకభారము పెట్తున్నా. లక్ష్మికి ఆగ్రావెళ్తున్నామనే ఆశను గాఢంగా కల్పించాలి. అవసరమైతే ఒక్కసంవత్సరము పాటైనా వుంటామని చెప్పాలి. ఇంతకంటే వేరే మందు కన్పించడములేదు నాకు. దీనిమీద ఆధారపడివుండి లక్ష్మి జీవితము. మీరు మాత్రము వీలైనప్పుడల్లా ఆ కిటికీని మూసెయ్యండి. కానీ, ఆ అమ్మాయి అడిగిన మరుక్షణములోనే తెరవాలిసుమండీ! లేకపోతే పరిస్థితులు విషమించవచ్చు. నేనుచెయ్యాల్సిందంతా చేస్తా. మీరుమాత్రము జాగ్రత్త' అంటూ డాక్టరు లోపలకెళ్లాడు. పార్వతమ్మా అనుసరించింది.

'ఎనిమిది...ఏడూ...'

'ఏమిటమ్మా, లక్ష్మీ, లెక్కపెడ్తున్నావు?' అన్నాడు డాక్టరు.

'మీరా? ఇంకా ఎందుకండీ, మీరు? ఆకులన్నీ ఎలాగు రాలిపోతున్నాయిగా! ఇదుగో! ఇంక ఏడు మాత్రము మిగిలిపొయ్యాయి. ఆఖరుదాంతోటి నేనూ రాలిపోతాను. అదుగో! మరొకటి రాలిపోయింది. ఇక ఆరే మిగిలాయి. దగ్గరకొస్తూంది, అంతము.'

పార్వతమ్మ కండ్లనొత్తుకుంటూ 'లక్ష్మీ! వూరుకోవమ్మా' అంది. డాక్టరుగారు పార్వతమ్మవేపు చూసి ఆగ్రా అన్నట్లు నోరు మెదిపారు.

'లక్ష్మీ, నేను ఆగ్రాకెళ్తున్నా.' అంది పార్వతమ్మ.


'ఆ! ఆగ్రాకా? అమ్మా! నన్ను పిల్చుకపోవూ? ఆ వెన్నెట్లోని తాజమహల్! అమ్మా! నేనూ వస్తానే! వెన్నెట్లో తాజమహల్! అబ్బ! ఎంత అందంగా వుంటుంది! డాక్టరుగారూ! తాజ్‌ని గూర్చి మీరిది విన్నారూ? ఒక అమెరికన్ ప్రయాణీకుడు ఆగ్రాకెళ్లాడట! అప్పుడేమో తాజ్‌ని చూచి అన్నాట్ట— 'ఇది ఘనీభవించిన సంగీతములా వుంది! అని'- ఇంతలో లక్ష్మి తలను కిటికీవేపు త్రిప్పి 'అదుగో! ఇంకో ఆకు రాలిపోతూంది. ఇక అయిదే మిగిలాయి. ఆఖరుదాంతోటి నేనూ ఆఖరు. అమ్మా! ఇన్నాళ్లూ ఏంచేశావే? ఇక అయిదు ఆకులు మాత్రమే మిగిలివున్నాయి. ఈ జన్మానికక లేదు ఆగ్రా కెళ్ళడం, తాజ్‌ని చూడడం! దానిని చిత్రించడం.'

పార్వతమ్మ డాక్టరు వైపు అతిదీనంగా చూసింది. 'నేనేం చెయ్యను' అన్నట్లు చూసి, డాక్టరు లక్ష్మి నాడి పరీక్షించి 'అమ్మా, లక్ష్మీ, నువ్వు బాగా విశ్రాంతి తీసుకోవాలమ్మా. ఇలాంటి పిచ్చిపిచ్చి ఆలోచన్లు పెట్టుకోగూడదు. నిద్రపో, తల్లీ, నిద్రపో' అంటూ దుప్పటి కప్పి, మామిడిచెట్టును వ్యక్తపరచే కిటికీ మూసి, మెల్లిగా బయటికెళ్ళాడు.

పార్వతమ్మ వెంబడించింది. 'డాక్టరుగారూ' అని బొంగురుపోయిన గొంతుతో పిల్చింది. డాక్టరు వెనక్కి తిరిగి 'పార్వతమ్మగారూ, మన లక్ష్మి చావుబ్రతుకుల్లో వుందండీ. వైద్యశాస్త్రము ఎంతవరకు ప్రాణాన్ని ప్రాణిలో నిలపెట్టగలదో అంతా చేసేను. నా చేతనయిందంతా చేసేను. ఇక మీ అదృష్టము' అంటూ బయటికెళ్ళిపొయ్యాడు. 'ఏమి వైద్యశాస్త్రమో! అంత శాస్త్రమూ నా లక్ష్మిని కాపాడలేక పొయ్యాక, అది తగలెట్టనా!' అని కంటి నీటిని తుడుచుకుంటూ, మామిడిచెట్టు దగ్గరకెళ్ళి కూర్చుంది. 'ఇకనైనా, ఆకులు రాలిపోవడము ఆగిపోతే ఎంత బావుంటుంది. ఓ దయామయుడా! నా లక్ష్మిని కాపాడు తండ్రీ' అనుకుంటూండగానే, ఓ పెనుగాలి వీచి మరో ఆకు రాలిపోయింది. 'నాలుగు' అని అతిదీనంగా లెక్కపెట్టింది. ఈ 'పాడుగాలి ఎక్కడ దాపరించింది నాతల్లికి. ఓ వాయుదేవుడా, ఆనాడు నీ కొడుక్కోసం స్తంభించిపొయ్యావ్! నీలాటికదుపుతీపే నాదికూడా! స్తంభించిపోరాదూ ఈనాడుకూడా' అని ఆమె విలపిస్తూంటే, అన్ని చెట్లు కదల నారంభించాయి. ఇంతలో ఒక్కమారుగా మామిడిచెట్టు కొమ్మలమీద మిగిలివున్న నాలుగు ఆకుల్లో మూడు రాలిపొయ్యాయి. పార్వతమ్మ ఇక దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కివెక్కి


# ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:  1907)

| | |
|---|---|
| జారీచేసి చందావేయబడిన మూలధనం | రూ. 72,00,000 |
| అడిగిన మూలధనము. | రూ. 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్ గోపాల అయ్యర్,
కార్యదర్శి.

ఏడవడం ప్రారంభించింది. ఇంతలో 'అమ్మా' అన్న పిలుపు వచ్చింది. కంటినీరు తుడుచుకుంటూ లక్ష్మి వున్న గదిలోకి వెళ్లింది. 'అమ్మా, ఎందుకే ఏడుస్తున్నావు? ఆ చెట్టుమీద ఒక్క ఆకైనా సరే వున్నంతవరకు నేనుపోనే. వెళ్లి కిటికీ తియ్యి, ఇంకా ఎన్ని ఆకులున్నాయో చూస్తాను.'

పార్వతమ్మ మెల్లిమెల్లిగా వెళ్లి కిటికీ తీసింది. 'ఆఖరు ఆకువుందా' అని తన్నుతానే ప్రశ్నించుకొంది. వుంది! గాలేమో తెగవస్తూంది కానీ, అది మాత్రము కొమ్మకంటుకొనే రెపరెపలాడ్తూంది.

'ఆ! అన్నీ రాలిపొయ్యాయే! ఇదొక్కటే మిగిలింది అమ్మా! నన్నిక ఆగ్రాపిల్చుకెళ్ళ వన్న మాట.'

'పిల్చుకెళ్తాను తల్లీ'

'ఇంకా ఏం పిల్చుకెళ్తావే. నీది పిచ్చికానీ, అదుగో ఆఖరు ఆకు! అది రాలిపోతే దాంతో పాటూ నేనూ.'

పార్వతమ్మ జవాబుచెప్పకుండా బయటికెళ్ళి పోయింది. లక్ష్మి మాత్రము ఆకువేపే మరల్పని దృష్టితో చూస్తూంది. పెద్ద గాలివచ్చింది. ఆకు మాత్రము ఇంకా చెట్టు నంటుకొనేవుంది. వాన పడడం ప్రారంభించింది. గంట అయినా ఆకు చెట్టు నంటుకొనేవుంది.

'అమ్మా! అమ్మా!'

పార్వతమ్మ లోపలకొచ్చింది. ఆమెకండ్లను ఆమే నమ్మలేకపోయింది. లక్ష్మి కూర్చునివుంది.

'అమ్మా! ఎప్పుడు వెళ్దామే ఆగ్రాకు, ఆఖరు ఆకు మిగిలిపోయిందే! అది రాలిపోదట! నాకు నయమవగానే పోదామా?'

'అలాగే నమ్మా, నువ్విప్పుడు పడుకొని, నిద్రపో.'

'సరే నమ్మా, నిద్రపోతా. ఆగ్రాలో వెన్నెలలో తాజ్‌ని చిత్రించాలి. ఏమంటావు? సరే అను.'

'అవసరమైతే ఆరునెల్లయినా వుందామమ్మా అక్కడ. నీ వొళ్లు నెమ్మదించాలనే కానీ'

'నెమ్మదించిందే! అంత వానలో, అంత గాలిలో ఆ ఆఖరు ఆకు నిల్చిందే. నేను నిలవలేనా? నెమ్మదించింది. కావలిస్తే డాక్టరునువచ్చి చూడమనమ్మా.'

'నువ్విప్పటికి నిద్రపో తల్లీ. రేపు పొద్దున్నే వచ్చి పరీక్ష చేస్తాడు.'

'నాకు రెండుమూడు రోజుల్లో పత్యము పెట్టించాలి. తెల్సిందా?'

'అల్లాగేనమ్మా! నువ్వు నిద్రపోతల్లీ'

'సరే' అంటూ కప్పుకొని నిద్రపోయింది లక్ష్మి.

మరుసటిరోజు ఉదయం డాక్టరు బయటికొస్తూ 'ఆఖరు ఆకు రాలిపోయింది, మీ లక్ష్మి రాలిపోయింది' అన్నాడు. 'ఆ' అంటూ పెద్దగా ఏడుస్తూ పార్వతమ్మ లోపలకు పరుగెత్తింది.

(ఓ హెన్రీ ఇంగ్లీషు కథకు అనుసరణ)


ముర్రె బార్ సబ్బుతో
ఉతికినవిగనుక,
నాదుస్తులు మరక లేకుండా
ఎల్లప్పుడు శుభ్రముగానుంటున్నాయి



ముర్రె ఇండస్ట్రీస్ లిమిటెడ్
మదరాసు వారి తయారీ
సకలవస్తువులు ఈమాదిరిగానుండవని గ్రహించండి